



# రెండవ భాగము

క్రింద వున్నతను సిక్స్ సెల్స్ టార్చి వెలిగించాడు. ఎదురుగా వున్న బోటుపైన పడింది. పైనున్న వ్యక్తి గన్ పేల్చాడు. గుండు దూసుకువెళ్ళి మా గ్యాంగ్‌లో ఒకడికి తగిలింది.

"అమ్మా" అంటూ నొప్పికి తట్టుకోలేక బోటులోంచి సముద్రంలోకి దూకేశాడు అతను.

"వన్ డౌన్" అరచాడు పైనుంచి.

"కారీ ఆన్!" క్రిందనున్న రెండో డెవిల్ చెప్పాడు. ఈమారు క్రిందనున్న అతను పేల్చాడు. పైనున్న అతను టార్చి వేశాడు. మరో మనిషి చచ్చాడు. వాళ్ళవేపునుండి టార్చిలైటు వెలుగు మా బోటుమీద పడింది.

"సర్కిల్ ది బోట్" అన్నాడు.

నేను వీల్ పట్టుకుని గబగబ త్రిప్పాను.

బోటు గిరగిర తిరుగుతూ ముందుకు బోయింది. వాళ్లు

కాల్చిన గుండ్లు మా బోటుకు తగిలాయి.

నడిసముద్రంలో జరుగుతోంది సంకులసమరం.

పదిహేను నిముషాలసేపు తుపాకి గుండ్లు వర్షంలా కురిశాయి రెండువేపులనుండి. మా బోట్‌లో ఎవ్వరు చావలేదు. కానీ మా గ్యాంగ్‌లో చాలామంది నేల కూలారు. అందులో ఇద్దరు మాత్రం మిగిలినట్లున్నారని పైనున్న డెవిల్ చెప్పాడు.

అతనుకూడా దిగి క్రిందకొచ్చాడు.

యుద్ధం ఆగింది.

"అటునుంచి కాల్పులులేవు! కారణమేమిటి?" అడిగాను.

"అందరూ చచ్చారేమో?" అన్నాడు రెండో డెవిల్.

"లేదు! ఇంకా ఇద్దరన్నా ప్రాణాలతో వుండి వుంటారు. ఎవ్వరూ లేకపోతె ఈ విసురుగాలికి ఆ బోటు తీరంవైపు వెళ్ళిపోతూ వుండవలసింది. అది మెల్లిగా మన వైపుకే వస్తోంది. గమనించండి" అన్నాడు మొదటి డెవిల్.

నేను దృష్టిసారించి నిశితంగా చూశాను. అతను చెప్పింది నిజమే. బోటు ముందుకు వస్తోంది.

"మరి యుద్ధం ఎందుకాపినట్లు?" అర్థంగాక అడిగాను.

"మనం అందరూ చచ్చారనుకొని దగ్గరకు వెళ్ళే ప్రయత్నం చేస్తాం! బాగా దగ్గరకు వెళ్ళాక కాల్చి చంపాలని వాళ్ళ ప్లానయివుంటుంది" అన్నాడతను.

"అయితే ఏంచేద్దాం?"

"మనం మన దోవన వెళ్ళిపోదాం! వాళ్ళతో మన కవసరంలేదు. ఆ షిప్ లంగరు వేసుకుని మనకోసం వెయిట్ చేస్తూ వుంటుంది."

"మరి వాళ్ళో్స్తే!"

"చంపేద్దాం!"

"ఆ వజ్రాలు మనకు అందిస్తారా?" అడిగాను.

"ఇవ్వరు! మామూలుగా సరుకుల మార్పిడీ ఎలా జరుగుతుందో నీకు తెలుసా?" అడిగాడు రెండో డెవిల్.

"మేము షిప్ కు దగ్గరగా బోట్ ను ఆపుతాం. టార్చిలైటు వెలిగిస్తూ ఆర్పుతూ వుంటాం. షిప్ లో వాళ్ళు దిగి లైఫ్ బోట్ లో సామాను తీసుకొచ్చి అందిస్తారు. మా బోట్లో పార్టీ చేస్తాం. సరుకులు మార్చుకున్నాక వాళ్ళు వెళ్ళిపోతారు" అన్నాను.

"పార్టీ చేసేందుకు మనదగ్గర మందుందా?"

"నేను ఒక డజను విస్కీ బాటిల్స్ తెచ్చాను," అన్నాను.

"గుడ్! బోటువాళ్ళకు పరిచయమైనదే గాబట్టి అనుమానించరు. నువ్వుకూడా వాళ్ళను నమ్మించవచ్చు."

"ఐవిల్ ట్రై" అన్నాను నేను.

బోటు ముందుకు సాగిపోతోంది.

నా దృష్టంతా వెనక వస్తున్న బోట్ పైనే వుంది. వాళ్లు గుండెలుతీసిన మొనగాళ్లు. ప్రాణాలతో వున్నా, నా బోట్లోని వాళ్ళను సముద్రం దాటనిచ్చే రకంకాదు. నా వెంటవున్న డెవిల్స్ కూడా సామాన్యులుగారు. వాళ్ళ షూటింగ్ మెథడ్స్ వండర్ ఫుల్ గా వున్నాయి.

బోటు మెల్లగా షిప్ దగ్గరకు చేరుకుంటూంది.

ఒక డెవిల్ పైకెక్కి టార్చిలైటు వెలిగిస్తూ, ఆర్పుతూ, సిగ్నల్స్ ఇవ్వసాగాడు. నేను బోట్ ఆపాను. క్రిందున్న రెండో డెవిల్ మెషిన్ గన్ మాగజైన్ తెరచి నిండా తుపాకీ గుండ్లు కూరాడు. యుద్ధానికి మళ్ళీ సన్నద్ధమవుతున్నాడనుకున్నాను.

షిప్ లోంచి ముగ్గురు మనుషులు లాడర్ మీదుగా

లైఫ్ బోట్ లోకి దిగడం మసకగా కనిపించింది. ఒకరి చేతిలో చిన్న హాండ్ కేస్ వుంది.

లైఫ్ బోట్ ముందుకు కదలి మా వైపు రాసాగింది.

పైనున్న డెవిల్ క్రిందకు దిగొచ్చి "వాళ్లు వస్తున్నారు" అన్నాడు.

"చూచాను!" చెప్పాను నేను.

"వాళ్లు వస్తే మనం ఏమివ్వాలి?"

"బంగారం!"

"మనదగ్గర లేదు గాబట్టి, మనపైన వాళ్ళకు అనుమానం వస్తుంది. తిరిగి వెళ్ళేందుకు బహుశా వాళ్లు ప్రయత్నిస్తారు. అప్పుడు వాళ్ళను చంపక తప్పదు మనకు. షిప్ లో వాళ్లు, వచ్చిన వాళ్ళ మనుషులు గంటలోగా తిరిగి రాకుంటే మనపైన కాల్పులు జరుపుతారు. కాబట్టి మనం వాళ్లు మన బోట్ ఎక్కిన వెంటనే బోట్ కదిలించి, షిప్ కు దూరంగా వెనక్కి పోనివ్వాలి" అన్నాడు మొదటి డెవిల్.

"వెనక మా గ్యాంగ్ వాళ్ళబోటు వస్తూనే వుంది. వీళ్ళను తప్పించుకోవడంలో వాళ్ళ చేతుల్లో పడతాం!" అన్నాను నేను భయంగా.

"తుపాకీ గుండ్లు కాల్చుకుంటూ మనం దారి ఏర్పరచుకోవాలి. నువ్వు భయపడకు. ధైర్యంగా వుండు" అన్నాడు రెండో డెవిల్.

నాకేం జవాబు చెప్పేందుకు తోచలేదు. వాళ్ళు చెప్పినట్లు చెయ్యడంకన్నా మరో మార్గం తోచలేదు కూడా.

లైఫ్ బోటు దగ్గరగావచ్చి మా బోటు ప్రక్కనే ఆగింది. నేను బోటుచివరకెళ్ళి నిలబడ్డాను.

"హల్లో మిస్టర్ రాజ్! హౌ డూ యూ డూ!"

అన్నాడు అందులో వున్న వ్యక్తి. అతన్ని నేను రెండు సార్లు చూశాను. అతని వెంట మరో అమ్మాయి కూడా వుంది. ఆమె వెంట్రుకలు వెండిలా వున్నాయి. హాట్ పాంట్స్ వేసుకుంది. నిటెడ్ బనియన్ తొడుక్కుంది. అందులోంచి బ్రాసరీ, దానిలోపలి వక్షోజాలు స్ఫుటంగా కనుపిస్తున్నాయి.

"వెల్ కమ్! వెల్ కమ్! రండి" అంటూ ఆహ్వానించాను.

ముగ్గురూ మా బోటు ఎక్కారు.

ఆ అమ్మాయి బోటు కేసి చూసింది.

"సరుకు తెచ్చారా?" అడిగాను నవ్వుతూ.

"ఆఁ! ఆఁ! మీరొక్కరే వున్నారేం? మరెవ్వరూ రాలేదా?" అడిగాడతను.

"ఇద్దరు అనుచరులున్నారు. మా బోట్ను ఎక్సయిజ్ అధికారులు వెంట తరుముకొచ్చారు. వాళ్ళతో కాస్త యుద్ధం చేశాం. వాళ్ళ బోటు ఇంకా అదుగో ఆ ప్రాంతాల్లోనే వుంది" చెప్పాను నేను.

అతను టార్చి వెలిగించాడు సముద్రంపైకి. కానీ బోటెక్కడో దూరంగా వుండటంతో సరిగ్గా కనుపించలేదు.

"మిస్టర్ రాజ్! మీట్ మై గర్ల్ ఫ్రెండ్ మిస్ డెల్లా!" ప్రక్కనున్న ఆ అమ్మాయిని పరిచయం చేశాడతను. ఆమె నాకు షేక్ హాండ్ ఇచ్చింది. సన్నటి వ్రేళ్ళు తగలగానే నా వొంట్లో కరెంటు పాసయింది!

"గ్లాడ్ టు మీట్ యూ!" అన్నాను.

ఆమె కూడా తన సంతోషాన్ని వ్యక్తపరిచింది.

అందరం కూర్చున్నాం. నా వెంటవున్న డెవిల్స్ కూడా వచ్చారు పార్టీలోకి. విస్కీ బాటిల్స్ నాలుగు తెచ్చి ఓపెన్ చేశాం. కేన్డ్ ఫుడ్ టిన్స్ ఓపెన్ చేసి

మధ్యలో పెట్టుకున్నాం.

"ఛీర్స్!" అంటూ అందరం గ్లాసులు తగిలించుకొని త్రాగడం ఆరంభించాం.

"మిస్టర్ రాజ్! డెల్లాకు ఇండియా చూడాలని కోరికగా వుంది. నేను మళ్ళా పది హేను రోజుల్లో ఇదే దోవన తిరిగివస్తాను. ఆలోగా అంతా చూపించి నా దగ్గరకు తిరిగి చేర్చాలి డెల్లాను. కెన్ యూ డూ దిస్ ఫర్ మీ!" అడిగా డతను.

"విత్ ప్లెజర్!" విస్కీ గొంతులో పోసుకుంటూ అన్నాను.

త్రాగడం పూర్తయింది.

వ్యాపారం ప్రారంభించారు.

"బంగారం తెచ్చారా?" అడిగాడతను.

"తెచ్చాం! మాకూ, ఎక్సయిజ్ వాళ్ళకు జరిగిన యుద్ధంలో ఆ బాండ్ కేస్ ఎక్కడో జారిపోయింది. మీ సరుకు ఇవ్వండి. డెల్లాతో బంగారం పంపిస్తాం!" అన్నాడు మొదటి డెవిల్.

"యస్! దటీజ్ కరెక్ట్. ఈ మారు అలా చెయ్యండి" అన్నాను నేను.

"ఇక్కడ్నుంచి వెళ్ళంగానే షిప్‌లో వున్న మా బాస్ అడుగుతాడు. బంగారం చూపించకుంటే ఒప్పుకోడు. సరుకు తిరిగి తీసుకెళ్ళిపోవలసిందే" అన్నాడతను.

"మేము ఉత్త చేతుల్తో తిరిగి వెళ్ళడం ఎలా? వజ్రాలకు మంచి ఆఫర్సుకూడా వున్నాయి. తీరం చేరగానే డెల్లాకు హాండ్ ఓవర్ చేస్తాను బిల్ట్ నన్ను నమ్ము" అన్నాను నేను.

"ఇది స్మగ్లింగ్ బిజినెస్. ఇందులో నమ్మకాలకు తావులేదు. అప్పులు పెట్టి వ్యాపారం చెయ్యడం మాకు

అసలు అలవాటు లేదు. డెల్లాను తిరిగి తీసుకొచ్చేప్పుడు బంగారు తెండి. సరుకు పట్టుకుపొండి. అంతకన్నా మరో మార్గంలేదు'' అన్నాడతను ధృడంగా, నిశ్చయించుకొని.

మొదటి డెవిల్ నాగుబాములా బుసకొట్టాడు. రెండో డెవిల్ చెయ్యి గన్ పైకి పోయింది. నేను ఇద్దర్నీ ఆగమన్నట్లు సంజ్ఞ చేశాను.

''ఓ. కే భాయ్! మేము సెలవు తీసుకుంటాం. డెల్లా! ఇండియా అంతా తృప్తిగా తిరిగిరాండు. పదిహేనో దినం వచ్చేసెయ్। సరేనా?'' అన్నాడతను.

''ఓ. కే'' అంది డెల్లా తల త్రిప్పుతూ.

అందమైన ఆడదాన్ని నమ్మి నా చేతుల్లో పెట్టగలిగాడు గానీ, వజ్రాలు మాత్రం ఇచ్చేందుకు ఒప్పుకోని అతని మనస్తత్వం నాకు వింతగా తోచింది. డెల్లాను వదిలేసి మిగిలిన ఇద్దరూ మా బోట్ లోంచి, వాళ్ళొచ్చిన లైఫ్ బోటులోకి మారేందుకు ప్రయత్నించేప్పుడు డెవిల్స్ ఇద్దరూ మెషిన్ గన్లు మ్రోగించారు. గువ్వలా సముద్రంలోకి కూలిపోయారు. వాళ్ల చేతుల్లో వున్న బాండ్ కేస్ కూడా సముద్రంపైన పడింది.

మొదట డెవిల్ లోనికి దూకాడు.అలలమీద తేలుతూ అది ముందుకు పోసాగింది. ఆ కేస్ ప్లాస్టిక్ ది కావడం వల్ల నీళ్ళపై తేలుతూవుంది. అతను ఈదుకుంటూ వెళ్ళి అరవై గజాల దూరంపోయిన ఆ పెట్టెను పట్టుకొని తెచ్చాడు.

''జీసిజ్ ట్రెచరస్!'' అంది డెల్లా భయంతో నిలువెల్లా వొణికిపోతూ.

''నువ్వేం భయపడకు! నిన్ను సురక్షితంగా తిరిగి మీ వాళ్ళదగ్గరకు చేర్చే పూచీ నాది!'' అన్నాను.

(సశేషం)